సాక్షి
వికారాబాద్
శనివారం । 21 । డిసెంబర్ । 2024



సర్వేను అడ్డుకున్న రైతులు

అప్పాయిపల్లి గ్రామంలో శుక్రవారం సర్వే చేపట్టేందుకు వెళ్లిన సిబ్బందిని గ్రామ రైతులు అడ్డుకున్నారు. 8లో ▸



రోడ్డుపై మురుగు..

తాండూరు పట్టణంలోని జాతీయ రహదారిపై మురుగు ఏరులై పారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో ▸



ఉపాధ్యాయ దినోత్సవం

శుక్రవారం పలుగుతండా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 9లో ▸

న్యూస్‌రీల్

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్

అనంతగిరి: 50వ అంతర్‌జిల్లా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం క్రీడాకారుల ఎంపిక ఉంటుందని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్, కార్యదర్శి వినోద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్ పూడూర్ మండలం ఎన్కెపల్లి గేట్ సమీపంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు 9701225929 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కాలుష్యరహిత పట్టణంగా పరిగి

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో పరిగి మున్సిపాలిటీ కాలుష్య రహిత పట్టణంగా మారిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో అన్నారు. మున్సిపాలిటీలో సుల్తాన్‌పూర్, నస్కల్, రుక్కుంపల్లి, సయ్యాద్‌మల్కాపూర్, షాకాపూర్, నజీరాబాద్ తండాలను మున్సిపల్‌లో విలీనం చేసిన సీఎంకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో విండ్ పవర్, సోలార్‌లతో విద్యుత్ వినియోగిస్తున్నామని చెప్పారు.

కోట్‌పల్లి ఎస్‌ఐగా అబ్దుల్ గఫార్



ఎస్పీ నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ గఫార్

బంట్వారం: కోట్‌పల్లి ఎస్‌ఐగా అబ్దుల్ గఫార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ స్రవంతి ఎస్పీ ఆఫీసుకు వెళ్లగా డీసీఆర్బీ నుంచి అబ్దుల్ గఫార్ కోట్‌పల్లి పీఎస్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గఫార్ ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

అనంతగిరి: మాజీమంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగానే కేటీఆర్‌ను ఇబ్బందులకు గురిచేసేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ఫార్ములావన్ కారు నిర్వహణపై అసెంబ్లీలో ఎందుకు ప్రస్తావించడం లేదన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన చివరకు న్యాయమే గెలుస్తుందని, మా నాయకుడు మచ్చలేని మకుటంలా ఉన్న వ్యక్తి అని కొనియాడారు.

కన్హాలో ముగిసిన జాతీయ సమైక్యతా సమ్మేళనం



నవోదయ విద్యార్థుల నృత్య ప్రదర్శన

నందిగామ: మండల పరిధిలోని కన్హా శాంతివనంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా సమ్మేళనం 2024–25 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వికసిత్ భారత్, మహిళా సాధికారత, భారతదేశ సాంస్కృతిక వారసత్వం అనే అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. శాస్త్రీయ, జానపద సంగీతంతో పాటు ఆయా రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన కళలు, నృత్యాలు ప్రదర్శించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నవోదయ విద్యాలయ సమితి జాయింట్ సెక్రటరీ జ్ఞానేంద్ర కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి ఉప సంచాలకుడు గోపాలకృష్ణ, వివిధ రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లగచర్లకు పండుగొచ్చింది

స్వగ్రామానికి చేరిన రైతులు



జైలు నుంచి వచ్చిన వారిని పట్టుకుని రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- భావోద్వేగానికి గురైన కుటుంబ సభ్యులు
- తమవారిని చూసి కన్నీటి పర్యంతం
- ఘనంగా స్వాగతం పలికిన స్థానికులు

దుద్యాల్: లగచర్ల కేసులో జైలుకు వెళ్లిన గిరిజన రైతులు 37 రోజుల తర్వాత స్వగ్రామాలకు చేరారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో నవంబర్ 11న జరిగిన ఘటనలో అరెస్టయిన లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంట తండాలకు చెందిన 17మంది రైతులు శుక్రవారం సంగారెడ్డి జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఇళ్లకు చేరుకున్నారు. వీరి రాకకోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన బాధిత కుటుంబ సభ్యులు తమ వారిని చూసి ఉద్వేగానికి లోనయ్యారు. గ్రామాల్లో వాహనాలు చేరుకోగానే టపాసులు పేల్చి, గుమ్మడికాయలు కొట్టి, పూల దండలు వేసి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. నెలకు పైగా జైలు జీవితాన్ని గడిపిన బాధితులు, ఇళ్లలో ఉండి నరకం అనుభవించిన కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. కొంతమంది మహిళలు బోరున విలపిస్తూ తమ వారిని హత్తుకున్నారు. కొడుకును చూసి తల్లి, భర్తను చూసి భార్య, మనవడిని చూసి అవ్వ.. ఆనందపరవశులయ్యారు. ఇది చూసిన గ్రామస్తులు సైతం కంటతడి పెట్టారు. జైలు నుంచి విడుదలైన వారంతా మొదట రోటిబండతండాకు చేరుకోవడంతో ఉద్విగ్న వాతావరణం నెలకొంది.



దేవుడి దయతో క్షేమంగా వచ్చాడు

జైలులో గుండెపోటుకు గురైన హీర్యానాయక్ చూసి ఆయన భార్య దేవీబాయి సంతోషం వ్యక్తం చేసింది. ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలోనూ పోలీసులు తన భర్తకు బేడీలు వేయడాన్ని గుర్తుచేసుకుని కంటతడిపెట్టింది. దేవుడి దయవల్ల ఆయన క్షేమంగా తిరిగొచ్చాడని తెలిపింది.

– దేవిబాయి, పులిచర్లకుంటతండా



చూసి ఎన్నిరోజులైంది బిడ్డా..

రోటిబండతండాకు చెందిన వినోద్ తల్లి సుశీలబాయి కొడుకును చూసి బోరున విలపించింది. ఎన్ని రోజులైంది బిడ్డా నిన్ను చూసి అంటూ గుండెలకు హత్తుకుంది. 37 రోజులుగా ఎట్లున్నావ్.. ఏమి తిన్నావ్ అంటూ విలపించింది. పోలీసులు కొట్టిన దెబ్బలతో తన కొడుకు చేతికి కాయలు కాచాయని కన్నీటి పర్యంతమైంది.



ఆప్యాయంగా అమ్మచేతి ముద్ద..

రోటిబండతండాకు చెందిన సోనీబాయికి ఏకైక కుమారుడు బాష్యనాయక్. లగచర్ల ఘటనతో తన కొడుకుకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం ఆరోజు రాత్రి ఇంట్లో ఉన్న పాపానికి పోలీసులు తీసుకెళ్లారని వాపోయింది. 37 రోజుల తర్వాత ఇంటికి వచ్చిన కొడుకుకు అన్నం కలిపి ఆప్యాయంగా ముద్దలు తినిపించింది.



సంతోషంగా ఉంది

పులిచర్లకుంటతండాకు చెందిన రైతు ప్రవీణ్‌నాయక్ భార్య జ్యోతి నిండు గర్భిణి. తన భర్తను అరెస్టు చేసిన రోజు ఎంత వేడుకున్నా పోలీసులు వినలేదని వాపోయింది. తమవారి కోసం ఢిల్లీకి వెళ్లి ఎన్‌హెచ్‌ఆర్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిశామని తెలిపింది. డెలివరీ సమయంలో తన భర్త ఇంటికి రావడం సంతోషంగా ఉందని ఆనందభాష్పాలు రాల్చింది.

టార్గెట్ చేరుకోవాలి



గ్రామీణ అభివృద్ధి అధికారులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్త్రీనిధి రుణాల పంపిణీ, బ్యాంక్ లింకేజీ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం ఆయన కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామీణ అభివృద్ధి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హత ఉన్న మహిళా సంఘాలకు టార్గెట్ ప్రకారం రుణాలు అందించి.. వంద శాతం రికవరీ సైతం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 60 ఏళ్లలోపు మహిళలు రుణాలు తీసుకుని చనిపోతే సంబంధిత ప్రతాలు మండల సమాఖ్యలో అందజేసి లబ్ధిపొందాలన్నారు. ప్రతీ వారం గ్రామీణ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షిస్తూ రికవరీలపై శ్రద్ధ చూపాలన్నారు. లోన్ తీసుకునే సమయంలో సమస్యలు వస్తే సంబంధిత అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. క్లెయిమ్‌లకు సంబంధించిన రిపోర్టులు ఎప్పటికప్పుడు అందజేయాలని ఆదేశించారు. టూవీలర్ మొబైల్ క్యాంటీన్, బ్రౌన్ రైస్, మిల్లెట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, అదనపు పీడీ సరోజ, స్త్రీనిధి ఆర్‌ఎం ఉదయకుమారి, డీపీఎంలు, ఏపీఎంలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘మహా’ ధ్యానం.. అంతా సిద్ధం

- నేటి నుంచి పత్రీజీ ధ్యాన మహాయాగం
- తరలివస్తున్న ధ్యానులు

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్ (పత్రీజీ శక్తి స్థల్)లో శనివారం నుంచి నిర్వహించే ధ్యాన మహాయాగ వేడుకలకు పిరమిడ్ ప్రాంగణం ముస్తాబైంది. ఈనెల 31 వరకు 11 రోజుల పాటు కొనసాగే కార్యక్రమాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచే వేలాదిగా ధ్యానులు తరలిరావడం కనిపించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాలకు ప్రముఖ ఆధ్యాత్మిక, ధ్యాన గురువులు, కళాకారులు హాజరుకానున్నట్టు ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానులకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ

ధ్యాన వేడుకల సందర్భంగా మహేశ్వర మహాపిరమిడ్‌ను శుక్రవారం సాయంత్రం శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్



బోనాలతో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

ఎస్‌ఎస్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యా నాయక్
- బోనమెత్తి నిరసన తెలిపిన ఉద్యోగులు

అనంతగిరి: తమ సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం బోనాలు ఎత్తి నిరసన తెలిపారు. ఎస్‌ఎస్‌ఏలోని అన్ని విభాగాలకు చెందిన మహిళ ఉద్యోగులు బోనమెత్తి వికారాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్ల మీదుగా ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కేతావత్ గంగ్యా నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి వెంటనే తమను చర్చలకు పిలిచి న్యాయం చేయాలన్నారు. 21 ఏళ్లుగా విద్యాశాఖలో కీలకంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ప్రభావతి, రవికుమార్, ఆశాలతా, స్వరూప, శైలజ, రాధిక, పల్లవి, దేవి, రాజేశ్వరీ, స్రవంతి, సుమిత్ర, చైతన్య, రఘుసింగ్, సర్వర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కళ్లు తెరవాలి:డాక్టర్ రాజశేఖర్

21 సంవత్సరాలుగా విద్యాశాఖలో చాలి చాలని వేతనాలతో పనిచేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ జిల్లా ఆధ్యాత్మిక సెల్ అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయాలన్నారు. లేదంటే ఎస్‌ఎస్‌ఏల ఉద్యమంలో తాము సైతం ముందుండి పోరాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్, సుధాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల వంటా–వార్పు



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు వికారాబాద్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయాలన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టి అక్కడే భోజనాలు చేశారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దండం పెట్టి వేడుకుంటున్నాం..

సీఎం సారూ.. పాఠశాల భవనం మంజూరు చేయండి

హస్నాబాద్ హరిజన్ చెర్రి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతోంది. గతంలో పలుమార్లు అధికారులు, పాలకులు భవనాన్ని పరిశీలించినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సైతం పరిశీలించడం.. ప్రభుత్వం కొడంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగింది. ఈ బడ్జెట్‌లోనూ భవనం మంజూరు చేయకపోవడంతో శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థులు దండం పెడుతూ తమ నిరసన తెలిపారు. – దుద్యాల్



దండం పెడుతూ విద్యార్థుల నిరసన, ఇన్‌సెట్‌లో పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

పైకొచ్చిన పాతాళ గంగ



భారీ వర్షాల కారణంగా భూగర్భజలాలు పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఏ ఏడాది మరింత తక్కువ లోతులోనే నీరు లభిస్తోంది. దీంతో సాగుకు సరిపడా నీరందుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 7.02 మీటర్ల పైకి చేరిన భూగర్భజలాలు
- గతేడాదితో పోలిస్తే 1.44 మీటర్ల అధికం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

తాండూరు: మూడేళ్లుగా పాతాళ గంగమ్మ కరుణిస్తోంది. బోరు బావుల కింద సాగు చేపట్టే యాసంగి పంటలకు నీరు పుష్కలంగా అందుతోంది. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయి. దీంతో బావులు, బోరుబావులు రీచార్జ్ అయ్యాయి. భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నవంబర్ 17 నుంచి 26 వరకు భూగర్భ జలాల నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని 77 భూగర్భ జలాల నమోదు కేంద్రాల(ఫీజో మీటర్) ద్వారా ఎంత లోతులో జలాలున్నాయనే వివరాలు పరిశీలించి రికార్డు చేశారు. గతేడాది నవంబర్‌లో 8.46 ఫీజో మీటర్ల లోతులో భూగర్భ జలాలుండగా.. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో 7.02 ఫీజో మీటర్ల లోతులో జలాలున్నట్లు అధికారులు ధృవీకరించారు. గతేడాదిలో పోల్చుకుంటే ఈ సీజన్‌లో 1.44 మీటర్ల వరకు భూగర్భ జలాలు పెరిగాయి.

సాధారణం కంటే అధిక వర్షపాతం

వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు 623.6 మి.మీల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా భారీగా కురిసిన వర్షాలకు 877.8 మి.మీల వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. బోరుబావుల నుంచి పంటలకు సమృద్ధిగా నీరందుతుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాల వివరాలు

మండలం	పెరిగిన నీటి మట్టం (ఫీజో మీటర్లలో)
కొడంగల్	4.94
పూడూరు	5.27
మోమిన్‌పేట	6.01
వికారాబాద్	6.13
బంట్వారం	6.55
కుల్కచర్ల	7.78
బొంరాస్‌పేట్	7.11
పెద్దేముల్	12.17
ధారూరు	13.84
పరిగి	15.32
మర్పల్లి	16.58
దుద్యాల	17.56

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి



నవంబర్‌లో జిల్లాలో భూగర్భ జలాల వివరాలు సేకరించాం. జిల్లా వ్యాప్తంగా సగటున 7.02 ఫిజోమీటర్ల భూగర్భజలాలు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈ నెలలో 1.44 మీటర్ల వరకు భూగర్భ జలాలు పైకి చేరుకున్నాయి. దుద్యాల, పరిగి, మర్పల్లి, పెద్దేముల్ మండలాల్లో వాటర్ లెవల్స్ కొంత తగ్గాయి. భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడు గుంతలు, కందకాలు, ఫాంపండ్స్ లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. వర్షపు నీటిని వృథా చేయకుండా ఒడిసి పట్టినప్పుడే గ్రౌండ్ వాటర్ పెరుగుతుంది.

– రవిశంకర్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి

క్లుప్తంగా

వెంటనే చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: అసెంబ్లీలో సభాపతిని అవమాన పర్చేలా పేపర్లు చించి విసిరేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లేశం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సామరస్యంగా సమావేశాలు జరుగుతున్న తరుణంలో కావాలనే సభలో గందరగోళం సృష్టించేలా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ వాళ్లు పదేళ్ల అధికారంలో ఉండి ఏమి చేయలేకపోయారని విమర్శించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆరు జట్లు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న తాండూరు, బొంరాస్‌పేట జట్లు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 14 బాలికల, 18 బాలుర జట్లు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాయి. సాయంత్రం వరకు నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో తొలి మూడు స్థానాల్లో వరుసగా కొడంగల్, మర్పల్లి, పరిగి నిలవగా బాలికల విభాగంలో తాండూరు, బొంరాస్‌పేట, కుల్కచర్ల జట్లు గెలుపొందాయని పీడీలు అనిల్‌కుమార్, అజీజ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ టోర్నమెంట్‌కు ఆరు జట్లు ఎంపికయ్యాయని తెలిపారు.

బాలిక అపహరణపై పోక్సో కేసు

యువకుడికి రిమాండ్

కుల్కచర్ల: బాలికను అపహరించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన బాలిక(17)ను గత నెల మొదటివారంలో దోమ మండలం గొడుగోనిపల్లి గ్రామానికి చెందిన నరేష్ అపహరించుకుని వెళ్లాడు. ఈమేరకు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారించి అపహరించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలుసుకున్న పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని శుక్రవారం పరిగి సబ్ జైలుకు తరలించారని ఎస్ఐ తెలిపారు.

కట్నం కోసం వేధించిన భర్తపై కేసు



ఖలీల్‌ని అరెస్ట్ చేసిన పోలీసులు

తాండూరు టౌన్: అదనపు కట్నం కోసం వేధించిన భర్తపై ఓ భార్య ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ భరత్‌రెడ్డి కథనం ప్రకారం.. సాయిపూర్‌కు చెందిన సారియా సుల్తానా, ఖలీల్ ఖురేషి భార్యాభర్తలు. వీరికి రెండేళ్ల క్రితం వివాహమైంది. 9 నెలల బాబు కూడా ఉన్నారు. అయితే ఖలీల్ తనను కొన్ని నెలల నుంచి అదనపు కట్నం కోసం వేధించి, చిత్రహింసలకు గురి చేశారని సుల్తానా ఆరోపించారు. అంతేకాకుండా అత్త సుల్తానా బేగం, ఆడపడుచు సల్మాలను కూడా తనని వేధించారని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు ఖలీల్‌ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగని సమ్మె.. సాగని చదువు

కరోనా సంక్షోభం అనంతరం గాడిన పడుతున్న విద్యావ్యవస్థలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కస్తూర్బాల్లో పనిచేసే ఉపాధ్యాయులు, పాఠశాలలను పర్యవేక్షించే సీఆర్పీలు సమ్మెలోకి వెళ్లడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించింది. దీని ప్రభావం పది, ఇంటర్మీడియట్ విద్యార్థులపై పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- 11 రోజుల నుంచి సమ్మెలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- ముంచుకొస్తున్న పరీక్షలతో ఆందోళనలో విద్యార్థులు



ఉపాధ్యాయులు లేక చదువుకుంటున్న విద్యార్థులు

కుల్కచర్ల: సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు చేస్తున్న సమ్మె విద్యార్థుల పాలిట శాపంగా మారింది. గత 11 రోజుల నుంచి వారి సమస్యలను పరిష్కరించాలని సామూహికంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కుల్కచర్ల మండల పరిధిలోని సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులందరూ వికారాబాద్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను పర్యవేక్షించేందుకు పనిచేసే సీఆర్పీలు, కేజీబీవీలో ఇంటర్మీడియట్ వరకు బోధించే ఉపాధ్యాయులు, పాఠశాలలకు సమాచారం అందించే మెసెంజర్‌లు, పాఠశాలల జీతాలు, తదితర ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహించే కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులందరూ సమ్మె బాట పట్టడంతో క్షేత్రస్థాయిలో గందరగోళ పరిస్థితి నెలకొంది. పాఠశాలలకు బియ్యం సరఫరా చేయడానికి సీఆర్పీలు సమ్మెలో ఉండటంతో ఎంఈఓలు బాధ్యత తీసుకుని ప్రతి పాఠశాలకు వెళ్లి పరిశీలిస్తున్నారు.

పరీక్షల సమయం

జిల్లాలో 19 మండలాల్లో 19 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 728 ఉపాధ్యాయులు ఉండగా వారందరూ ప్రస్తుతంలో సమ్మెలో ఉన్నారు. ఉదాహరణకు కుల్కచర్ల మండల పరిధిలోని కేజీబీవీలో 18 మంది ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్లడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు లేకుండా పోయారు. అలా జిల్లా పరిధిలో ఉన్న కేజీబీవీలో ఉపాధ్యాయులందరూ సమ్మెలోకి వెళ్లడంతో పాఠ్యాంశాలు పూర్తికాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల తేదీలను ప్రభుత్వం ప్రకటించింది. మార్చి మొదటి వారంలోనే ప్రారంభమవుతాయి. అప్పటివరకు అయినా సిలబస్ పూర్తి అవుతుందా కాదా అని విద్యార్థులు మానసిన వేదన అనుభవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం విద్యార్థులకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బియ్యం సరఫరాను పర్యవేక్షిస్తున్న కుల్కచర్ల ఎంఈఓ హబీబ్ అహ్మద్

పోరాటం ఆగదు



సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అనుసరించి వాటిని అమలు చేయాలని కోరుతున్నాం. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత వంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచుతున్నాం. న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం కొనసాగుతుంది.

– గాంగ్యానాయక్, ఎస్ఎస్ఏ, జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం స్పందించాలి



ఎన్నో ఏళ్లుగా తాము సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలి. లేకుంటే విద్యార్థులు కూడా నష్టపోతారు. పరిస్థితులు చేయి దాటకముందే ప్రభుత్వం యంత్రాంగం చొరవ చూపి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

– దేవి, ప్రత్యేకాధికారి, కేజీబీవీ కుల్కచర్ల

మళ్లీ చదువుతున్నాం



పాఠాలు చెప్పేవారు లేక గతంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మళ్లీ చదువుకుంటున్నాం. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు రాకపోవడంతో సందేహాలు వస్తే పరిష్కారం చూపే వారు కరువయ్యారు. నిత్యం పాత పాఠాలు చదువుకోవడమే జరుగుతుంది. పరీక్షలు దగ్గర పడుతుండడంతో భయాందోళనకు గురవుతున్నాం.

– మహేశ్వరి, విద్యార్థిని, పదో తరగతి, కేజీబీవీ

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కాలిపోయిన రూ.2 లక్షల నగదు, బంగారు ఆభరణాలు

మోమిన్‌పేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేట కేంద్రానికి చెందిన మంగళి శ్రీనివాస్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఉదయం ఆయన భార్య గంగమ్మ ఇంట్లో పూజ చేసి కూతురు అఖిలతో పాటు బయట వచ్చి కూర్చుంది. అనంతరం ఇంట్లో నుంచి పొగ రావడంతో తలుపు తీసి చూడగా మంటలు ఎగబడ్డాయి. దీంతో ఆమె అరవగా చుట్టు పక్కల వారు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని సాయంత్రం వరకు మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో నిత్యావసర సరుకులు, బట్టలు, రూ.2లక్షల నగదు, 2 తులాల బంగారం పూర్తిగా కాలిపోయిందని బాధితులు రోదించారు. రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, రాజ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రోడ్డుపై మురుగు.. పరిష్కారమెప్పుడో అడుగు

తాండూరు: తాండూరు పట్టణంలోని జాతీయ రహదారిపై కొన్ని రోజులుగా మురుగు నీరు ఏరులై పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని మహబూబ్ నగర్–చించోళి రోడ్డుని రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చారు. అందుకు అనుగుణంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు పక్కన వరద, మురుగు నీరు పారేందుకు పెద్ద కాలువలను నిర్మించారు. అయితే 8 నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ వాటిని అసంపూర్తిగా వదిలేశారు. పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి బస్‌స్టేషన్ వరకు కాలువను నిర్మించారు. కానీ స్నేహ సూపర్ మార్కెట్ వద్ద ఉన్న రోడ్డు పక్కన మురుగు కాలువను అసంపూర్తిగా వదిలేశారు. రోడ్డు వెడల్పు పెరిగినా రహదారి వేయకపోవడం, మరోవైపు కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డుపై డ్రైనేజీ నీరు పారకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా వదిలేసిన మురుగు కాల్వ



రోడ్డుపై నుంచి పారుతున్న మురుగు నీరు

సేవలు వినియోగించుకోండి

పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ



పరిగి బస్టాండ్‌లో ప్రయాణికులకు మర్యాదపూర్వకంగా పుష్పం ఇస్తున్న డీఎం

పరిగి: ఆర్టీసీ ప్రయాణికుల కోసం ఎన్నో రకాల సేవలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిగి డీఎం కరుణశ్రీ సూచించారు. శుక్రవారం మర్యాదపూర్వక దినోత్సవం సందర్భంగా డీఎం, సిబ్బంది స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు పుష్పం ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రయాణికులతోనే ఆర్టీసీ నడుస్తుందని అందుకు మర్యాదలు చేయడం తమ విధి అన్నారు. ప్రజలు కూడా తమ ప్రయాణాన్ని ఆర్టీసీలోనే చేయాలని సూచించారు. ప్రైవేటు ప్రయాణాలకు స్వస్తి పలికి ఆర్టీసీ ప్రయాణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో తాండూరు కందిని పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య



పరిగి: అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పరిగి: బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికార మదమెక్కి అడ్డగోలుగా మాట్లాడిన అమిత్‌షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి పదవిలో ఉండి అంబేడ్కర్‌పై ఇలా మాట్లాడటం సరికాదన్నారు. భారత ప్రజలతో పూజింపబడే అంబేడ్కర్‌ను చిన్న చూపు మాటలతో మాట్లడటం నీతిమాలిన చర్య అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీనునాయక్, సత్తయ్య, శేఖర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి వాఖ్యలు ఇబ్బందికరం

కుల్కచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్‌పై అమిత్‌షా వాఖ్యలు ఇబ్బందికరమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో భాగంగా అంబేడ్కర్‌ను అవమానపర్చే విధంగా వాఖ్యలు చేయడం వారి అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ప్రభు, గాంగ్యానాయక్, లక్ష్మణ్, జంగయ్య, భరత్, ఇబ్రహిం, జాంగీర్, నాసీం, బాల్‌రాజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

తాండూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని తాండూరు మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు రాములు, బలరాం, నర్సింలు, రవి, కిష్టప్ప, మనోహర్, భాను, రాజు పాల్గొన్నారు.

సీఐటీయూ ఖండన

అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. చట్ట సభల సాక్షిగా బీజేపీ వైఖరి అణగారిన వర్గాలపై ఎలా ఉందో బహిర్గతమైందన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

అనంతగిరి: బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మల్లికార్జున్, శివ, శేఖర్, రాజు, సత్యం, నర్సింలు, గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన



తాండూరు టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

సర్వేను అడ్డుకున్న రైతులు

కొడంగల్: మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో సర్వేకు వెళ్లిన సిబ్బందిని అప్పాయిపల్లి రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇచ్చిన తరువాతే భూములు స్వాధీనం చేసుకోవాలని అధికారులకు రైతులు సూచించారు. అప్పాయిపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 19లో ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమిని సేకరించింది. రైతుల దగ్గర భూములు తీసుకొని ఎకరాకు రూ.10లక్షలు, ఒక ప్లాట్, ఒక ఉద్యోగం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ పరిహారం అందలేదని రైతులు ఆరోపించారు. పూర్తిగా పరిహారం చెల్లించిన అనంతరం ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఫకీరప్ప, మోతీబాయి, రాములు గౌడ్, వెంకటమ్మ పాల్గొన్నారు.



సర్వేను అడ్డుకుంటున్న రైతులు

పార్కింగ్ స్థలాన్ని కాపాడండి

మీర్‌పేట: కబ్జాకు గురైన పార్కింగ్ స్థలాలను తిరిగి ప్రజలకు ఇప్పించాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనప్రియా మహానగర్‌లోని 5, 9ఏ బ్లాకులలోని పార్కింగ్ స్థలాన్ని కొందరు కబ్జా చేసి షెటర్లు నిర్మించారని ఆరోపించారు. ఒక్కో షెటర్‌ను రూ.10 లక్షలకు విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటివరకు 8 షెటర్లను అమ్ముకోగా, మరో పది షెటర్లు అమ్మకానికి పెట్టారని వివరించారు. ఈ మేరకు పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్ స్పందిస్తూ.. ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ధారూరు: బహిర్భూమికి వెళ్లి వస్తున్న ఓ వృద్ధుడిని కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్‌లో చోటుచేసుకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కేశపల్లి నర్సింహులు(70) సాయంత్రం బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా కుక్క వెంబడించి దాడి చేసింది. గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మరోఘటనలో కుక్కింద గ్రామానికి చెందిన కానపురం మల్లయ్య(50) పశువులకు నీరు తాగించి ఇంటికి వస్తుండగా కుక్క దాడి చేసింది. వెంటనే అతడిని స్థానికంగా చికిత్స చేయించారు. శునకాల స్వైర విహారంపై స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

పరిగి: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గురుకులంలో వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్యాచరణ ఆధారిత విద్యా శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో సమస్యలను సమన్వయంతో ఎదుర్కోవాలని సూచించారు. విద్యార్థుల్లో మనోస్థైర్యాన్ని నింపడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. లక్ష్యసాధన కోసం ప్రతిఒక్కరూ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

తాండూర్‌టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అసిస్టెంట్ కలెక్టర్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉమా హారతి శుక్రవారం ఆరుగురికి జరిమానా విధించినట్లు పట్టణ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఆరుగురిలో ఐదు మందికి వెయ్యి రూపాయాల జరిమానా విధించినట్లు చెప్పారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

దుద్యాల్: మండలంలోని హకీంపేట్ గ్రామంలో ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ కో ఆర్డినేటర్ కవిత మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పాసైన మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, గ్రామస్తుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో ప్రథమ్ సంస్థ సభ్యులు

చికిత్స పొందుతూ.. కూలీ మృతి

బైక్– కారు ఢీకొన్న ఘటనలో

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని తంగడపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టుకు చెందిన హన్మంత్‌రెడ్డి, పోచయ్య(55)లు బుధవారం బైక్‌పై ఎన్కేపల్లి దగ్గర పెళ్లికి హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో శంకర్‌పల్లి మండలంలోని హుసెన్‌పూర్ చౌరస్తాలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన ఇరువురిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అందులో తీవ్రంగా గాయపడిన పోచయ్య గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు శుక్రవారం చేవెళ్లలో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కారుతో ఢీకొట్టిన పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వారితో మాట్లాడి ఈ ప్రమాదానికి సంబంధించి ఘటన జరిగిన రోజునే కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కారుతో ఢీకొట్టిన పోలీస్ అధికారి భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతి చెందిన పోచయ్య కుటుంబానికి చేవెళ్ల మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్ రూ.25 వేల నగదు అందించారు. మృతుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజు, సత్తయ్య తదితరులు ఉన్నారు.